రైతులు.. తస్మాత్ జాగ్రత్త

- ఎరువులు, విత్తనాల ఎంపికలో తొందర పాటు వద్దు
- లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి

ధన్వాడ: వానాకాలం సాగు కోసం రైతులు సన్నద్ధమవుతున్నారు. సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, వ్యవసాయ ఉపకరణాలు సమకూర్చుకోవాల్సిన సమయం కావడంతో మార్కెట్‌లో ఆయా ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలు రైతులను ఊరిస్తున్నాయి. అయితే విత్తనాలు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని నిపుణులు తెలుపుతున్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేస్తే భారీ నష్టాలు తప్పవు. ఎరువుల్లో నాణ్యత లోపిస్తే అప్పులు తప్ప ఏమీ మిగలవని అవగాహన కల్పిస్తున్నారు.

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సాగు చేసిన పంటల వివరాలు ఇలా (ఎకరాల్లో)	
పత్తి	6882
జొన్న	812
వరి	12800
కంది	1094
ఇతర పంటలు	810
మొత్తం	22398

తొలకరికి ముందే..

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభానికి ముందే వానలు దంచికొడుతుండడంతో అన్నదాతలు సాగులో నిమగ్నమయ్యారు. మండలంలోని గోటూర్, కొండాపూర్, కిష్టాపూర్‌లో ఇప్పటికే పనులు ప్రారంభించి ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో పలు రకాల కంపెనీలు తమ ఉత్పత్తులను కొనుగోలు చేసేలా ప్రచారం సైతం చేస్తున్నాయి.


పొలం దున్నుతున్న రైతులు

మోతాదుకు మించితే నష్టమే

రైతులు అధిక దిగుబడులపై ఆశతో విత్తనాలతో పాటు ఎరువును మోతాదుకు మించి వినియోగిస్తే లాభం కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల విషయంలో మోతాదుకు మించి వాడొద్దని సూచిస్తున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



ప్రస్తుత కాలంలో గ్రామాలలోని కొందరు దళారులు బయట నుంచి నకిలీ, నాసిరకం విత్తనాలను తీసుకొచ్చి రైతులకు అంటగడుతున్నారు. రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. ఆగ్రో కేంద్రాలు లేకపోతే లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే విత్తనాలు, మందులు కొని అలాగే రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి.

– నవీన్ కుమార్, ఏఓ, ధన్వాడ

క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 2000–01 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు యువక మండలి అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీఎస్ ఆస్పత్రి సహకారంతో యువక మండలి భవనంలో నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

మరికల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు మరికల్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగమణిమాల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే నైపుణ్య శిక్షణ తరగతులకు విద్యార్థులు 19 నుంచి 25 ఏళ్లలోపు ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇక్కడ పదో పతరగతి, ఇంటర్, డిగ్రీ గురుకుల పాఠశాలలో చదివిన విద్యార్థులు మరికల్ బాలికల గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

హౌసింగ్ ఏఈగా ఆంజనేయులు



మాగనూర్: ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల హౌసింగ్ ఏఈగా ఆంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మండలంలోని గూడులేని ప్రతి కుటుంబానికి నీడ కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. పథకంలో ఎంపికైన ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్క లబ్ధిదారుడు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దూరు: మద్దూరు పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ నిరంజన్ దాస్ పేర్కొన్నారు. కోస్గి–నారాయణపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను మారుస్తుండడంతో పట్టణంలోని పాతబస్టాండ్, ప్రభుత్వాసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. అవసరమైతే పట్టణం మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

మత్స్య సహకార సంఘాలకు రిజిస్ట్రేషన్



మక్తల్: భూత్పూర్ రిజర్వాయర్‌లో 10 మత్స్యకార సహకార సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. శనివారం జిల్లా కేంద్రంలో ఎస్ఎస్‌డీపీ పథకంలో భాగంగా రిజిస్ట్రేషన్ చేసుకోగా ఏడీ రహిమాన్ చేతుల మీద రిజర్వాయర్ అధ్యక్షుడు ఆనంద్‌శేఖర్ ధ్రువపత్రం అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మత్స్యకార సంఘాల బలోపేతానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా తిరంగా ర్యాలీ



దామరగిద్ద: జయహో వీర జవాన్, భారత్‌మాతాకీ జై అంటూ మండలంలోని కాన్‌కుర్తిలో యువకులు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శనివారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ బస్వరాజ్, సురేష్‌లు మాట్లాడుతూ దేశ ప్రజలకు రక్షణగా శత్రు దేశంపై వీరోచిత పోరాటంతో ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన జవాన్ల సేవలు మరవలేవన్నారు. అలాగే అమరులైన జవాన్‌లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

దేవరకద్ర: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకి హెచ్చరించారు. శనివారం దేవరకద్ర పోలీసుస్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలు విక్రయించే అవకాశం ఉందని అలాంటి వారి పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. రైతులను మోసం చేసే ఏ వ్యాపారి అయినా జైలుకు వెళ్లక తప్పదన్నారు.

అన్నదాతలకు నష్టం జరిగితే ఊరుకోం


చిట్టెం రాంమోహన్‌రెడ్డితో కాట్రేవ్‌పల్లి గ్రామ రైతులు

మక్తల్: మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద కాట్రేవ్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులకు నష్టం జరిగితే చూస్తూ ఊరుకోమని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మక్తల్ మాజీ ఎమ్మెల్యే నివాసంలో కాట్రేవ్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు తమ సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భూత్పూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయి ఎంతో నష్టపోయామని వివరించారు. అన్ని పోగొట్టుకొని రోడ్డున పడినట్లు తెలిపారు. ఇప్పుడు మళ్లీ మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం విషయంలో భూముల సర్వే పేరుతో రైతులను మోసం చేస్తున్నారన్నారు. స్పందించిన చిట్టెం రాంమోహన్‌రెడ్డి ప్రభుత్వం తరపున రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాట్రేవ్‌పల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాంబాబు సేవలు చిరస్మరణీయం


కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బాలస్వామి

నారాయణపేట రూరల్: ఇటీవల అకాల మరణం చెందిన విశ్వహిందూ పరిషత్ నారాయణ పేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు సేవలు మరవలేనివని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి పేర్కొన్నారు. రాంబాబు కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. డాక్టర్ రాంబాబు భార్య సురేఖ, కూతురు ఐశ్వర్య, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కన్నా శివ కుమార్, భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ శ్రవణ్ కుమార్, పట్టణ కార్యదర్శి ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు


ప్రమాదకరంగా గుంత

మద్దూరు: మద్దూరు మున్సిపాలిటీలోని కోస్గి–నారాయణపేట ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. పాతబస్టాండ్ చౌరస్తాలో ఉన్న ప్రధాన మురుగు కాల్వపై ఎలాంటి కప్పు లేకపోవడంతో రోడ్డు పక్కనే పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి


కూలీలతో మాట్లాడుతున్న బలరాం


నేరడగంలో సీఐటీయూ నాయకుల నిరసన

నారాయణపేట రూరల్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చిన్నజట్రం, అంత్వార్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల కేంద్రాలకు వెళ్లి సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న కలెక్టరేట్ ముందు నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి కూలీల రోజు వారి కూలి రూ.600 అలాగే ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

దామరగిద్ద: ఉపాధిహామీ కూలీల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. మండల కార్యదర్శి శివకుమార్ సమక్షంలో శనివారం మండలంలోని మొగుల్‌మడ్క, అన్నసాగర్, నర్సాపూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రోజు కూలి రూ.600 అందించాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు.

బకాయి బిల్లులు విడుదల చేయాలి

మాగనూర్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి గోవింద్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నేరడగంలో ఉపాధిహామీ పనుల ప్రదేశాలను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు రోజు వారి కూలి రూ.600 ఇవ్వాలన్నారు. అలాగే సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో ఏటా రూ. 2లక్షల కోట్లు కేటాయించాలని పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈడిగి బాలరాజ్‌గౌడ్, దేవేంద్రప్ప, ఇంద్రమ్మ పాల్గొన్నారు.

పెదిరిపాడ్ రేషన్ షాపులో తనిఖీ



మద్దూరు: మండలంలోని పెదిరిపాడ్ రేషన్ షాపులో హైదరాబాద్‌కు చెందిన ఈటీఎఫ్ టీం సభ్యులు శనివారం బియ్యం నిల్వలను తనిఖీ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా రేషన్ షాపులో రికార్డులను పరిశీలించారు. రేషన్ షాపులో ఉండాల్సిన బియ్యం నిల్వల కంటే 50 కేజీలవీ 14 బస్తాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో డీలర్ నాగేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ షాపును రేనివట్ల డీలర్ హన్మంతుకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ జన్మదిన వేడుకలు

ధన్వాడ: మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ జన్మదిన వేడుకలను శనివారం ధన్వాడ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఎమ్మెల్యేగా ప్రజలకు అనేక సేవలు అందించి ప్రస్తుతం పదవీ లేకున్నా ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారని జిల్లా మత్స్య పరిశ్రమిక సంఘం ఉపాధ్యక్షుడు నరసింహనాయుడు అన్నారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, బాబా, రాములు, ఉషానయ్య, శివ, సంజీవమని, భార్గవనాయుడు, కృష్ణయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

మరికల్: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం భవనం దగ్గర శనివారం ఆయన అభిమానులు కేక్‌కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సతీష్, మల్లేస్, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

మాగనూర్: శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన కమిటీని గ్రామ పెద్దల సమక్షంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా ఈడిగి రమేష్‌గౌడ్, పధాన కార్యదర్శి పి.భరత్‌కుమార్, కోశాధికారి కృష్ణయ్య, సభ్యులు దండు సాయిబన్న, పుంజనూర్ మహదేవ్, బి. రమేష్, పురుషోత్తంరెడ్డి, వాకిటి వెంకటయ్య, శరణప్ప, కరువ బుగ్గప్ప, బులి మేని నాగప్పలతో కమిటీని ఎనుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

షీ టీంకు సమాచారం అందించండి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట: విద్యార్థినులు వేధింపులకు గురైతే షీ టీంకు సమాచారం అందించాలని షీ టీమ్ పోలీసులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి జూనియర్ కళాశాల వద్ద సప్లిమెంటరీ ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బ్లాక్ మెయిలింగ్ వంటి ఏ సమస్యలు ఎదురైనా తమకు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు. ఆపదలో ఉంటే 87126 70398 కాల్ చేసి సమాచారం ఇవ్వొచ్చన్నారు. కార్యక్రమంలో షీ టీం పోలీసులు కవిత, జ్యోతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైనికుల ఆత్మస్థైరాన్ని దెబ్బతీయొద్దు


రఘువీర్‌యాదవ్

ధన్వాడ: ఆపరేషన్ సిందూర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చిల్లర మాటాలు మాట్లాడి సైనికుల ఆత్మస్థైరాన్ని దెబ్బతీయొద్దని బీజేపీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీర్ యాదవ్ అన్నారు. శనివారం ధన్వాడ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. చిన్న పిల్లడిలా మన ఫైటర్ జెట్స్ ఎన్ని కూలిపోయాయి.. ఎంత నష్టం జరిగిదంటూ ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. అలాగే తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎంపీ డీకే అరుణకు అభినందలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివరాజ్ నాయకులు రాంచంద్రయ్య, ఉమేష్‌కుమార్, ఉదయభాను, గోవర్దన్‌గౌడ్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల కలేనా..


అమరచింత శివారులో సబ్‌స్టేషన్ సమీపంలో జూనియర్ కాలేజీ నిర్మాణం కోసం గుర్తించిన స్థలం

అమరచింత: ప్రతి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తూ స్థానిక విద్యార్థుల చదువులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తుందే తప్పా ఇప్పటికీ మండల కేంద్రంలో కళాశాలను మంజూరు చేయలేక పోయింది. జిల్లాల పునర్విభజన సమయంలో కొత్తగా అమరచింత మండలం ఏర్పడి నేటికీ ఏడేళ్లు గడుస్తున్నా పాలకులు, అధికారులు ఇక్కడి కళాశాల నిర్మాణం గురించి ఆలోచించట్లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పట్టణ శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలించి, అక్కడే జూనియర్ కాలేజీ నిర్మిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కళాశాల ఏర్పాటు మరుగునపడింది.

ఆరు ఉన్నత పాఠశాలలు..

మండలంలో అమరచింత, మస్తీపురం, ఈర్లదిన్నె, నాగల్‌కడ్మూర్ గ్రామాల్లో మొత్తంగా ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది నాలుగు నుంచి ఆరు వందల వరకు విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్ కోసం గద్వాల, ఆత్మకూర్, వనపర్తి, మహబూబ్‌నగర్‌కు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. పేద విద్యార్థులు ఆత్మకూర్‌లోని జూనియర్ కళాశాలలో చదువుకునేందుకు వెళ్లినా.. సీట్ల కొరత కారణంగా అడ్మిషన్లు దొరకక చదువులకు దూరమై ఇంటి పనులకు పరిమిత మవుతున్న పరిస్థితులు దాపరించాయి.

చదువుకు దూరమవుతున్నారు



ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలేజీ కోసం స్థల సేకరణ చేపట్టి నిధులు మంజూరు చేయకుండా వదిలేశారు. దీంతో మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించాల్సి వస్తోంది. ఎమ్మెల్యే చొరవ చూపి జూనియర్ కాలేజీ మంజూరు చేస్తూ, ఈ విద్యా సంవత్సరంలోనే ఇంటర్ తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు, పీడీఎస్‌యూ

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి


నారాయణపేటలో శిక్షణ అనంతరం టీచర్లు


శిక్షణలో ఎంఈఓ బాలాజీతో ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ బాలాజీ అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బోధనలో కృత్రిమ మేధను ఉపయోగించి వెనకబడిన విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడికి దూరంగా ఉన్న విద్యార్థులను చదువుకొనేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

శిక్షణ ఎంతో ఉపయోగకరం

నర్వ: ప్రభుత్వ ఉపాధ్యాయులకు 5 రోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ ఆదివారం ముగిసినట్లు కోర్స్ డైరెక్టర్ రాంరెడ్డి తెలిపారు. నర్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1 నుండి 5 తరగతుల విద్యార్థు లకు తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం, సబ్జెక్టులలో ఉపాధ్యాయులు నూతన పద్ధతులతో బోధించడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీలు వెంకటేశ్, అనిల్, ప్రదీప్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. 5 రోజుల పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణా కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు సులువుగా అర్థవంతంగా పాఠాలు బోధించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టారు.

సులభ పద్ధతిలో బోధించాలి

ఊట్కూర్: ప్రభుత్వం వేసవి సెలవుల్లో ఊట్కూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఉపాధ్యాయ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. 5 రోజుల క్రితం ఉపాధ్యాయులకు గణితం, ఆంగ్లం తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్స్‌తో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు సులభమైన పద్ధతిలో భోదించే మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్స్ డైరక్టర్ హెచ్‌ఎం మాధవి, ఆర్పీలు స్వేత, గోపాల్, కృష్ణ, సత్యపాల్ పాల్గొన్నారు.

తరగతి గదుల్లో అమలు చేయాలి

మద్దూరు: విద్యా బోధనలో కొత్త పద్ధతులు అవలంభించేలా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 5 రోజుల పాటు మద్దూరులోని బాలుర ఉన్నత పాఠశాల నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిసినట్లు ఎంఈఓ బాలకిష్టప్ప తెలిపారు. ఈ నెల 20 నుంచి 25 వరకు 8 మంది నిపుణులతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు శ్రీహర్ష, మండలంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో అమలు చేయాలని ఎంఈఓ కృష్ణారెడ్డి సూచించారు. వృత్యంతర శిక్షణ కార్యక్రమం ముగింపు వేడుకల్లో కోర్సు డైరెక్టర్‌గా ఎంఈఓ కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా డీఆర్పీ, ఆర్పీలు అందించిన శిక్షణ అంశాలను పాఠ్యాంశ బోధనల్లో అమలు చేసి విద్యార్థుల్లో లర్నింగ్ సామర్థ్యాలను పెంచాలన్నారు.

సాంకేతికత ఉపయోగించుకోవాలి

నారాయణపేట ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు తమ బోధనలో సాంకేతికతను వినియోగించుకోవాని సమగ్ర శిక్ష తెలంగాణ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ వెంకట నరసమ్మ అన్నారు. వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశవారు.


మద్దూరులో శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు